పన్నులకే సగం..

కొత్త సుంకాలు అమల్లోకి వస్తే రూ.లక్ష విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేయాలంటే రూ.27వేలు పన్ను కట్టాల్సి ఉంటుంది. రవాణా, ప్యాకింగ్, ఇతరత్రా ఖర్చులతో కలిపి 50శాతం ధర పెరగడం ఖాయం. అందుకే రైతుల నుంచి సేకరించి అమెరికాకు రొయ్యలు తరలిస్తున్న వ్యాపారులు చేతులెత్తేస్తున్నారు. రొయ్యల ధర తగ్గిస్తున్నారు. చేసిందేమీ లేక రైతులు కూడా తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోంది. ఇలా అయితే నిర్వహణ కష్టమేనని ఆక్వా రైతులు చెబుతున్నారు. రెండు రోజుల కింద ట వరకూ 100 కౌంట్ ధర రూ.230 ఉంది. తాజా పరిణామాలతో ఉన్నఫలంగా రూ.40 తగ్గించారు. ఈ ధర మరింత తగ్గనుందని చెబుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్ప టికే తీర ప్రాంత జిల్లాల్లో రొయ్యల ఎగుమతి దారులు సమావేశమయ్యారు. అమెరికా సుంకాల ప్రభావం ఎంతలా ఉంటుంది? పెంచితే రొయ్యల ధర ఎంత తగ్గించాలి? ఏ విధంగా కొనుగోలు చేయాలి? అనే అంశాలపై చర్చించారు. సుంకం పెరిగితే జిల్లాలో ఆక్వా సాగు పడిపోవడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆక్వాకు కష్టకాలం



● ఈయన పేరు **బసవ గోవిందరెడ్డి**. రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన ఈయన గతంలో 25 ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగుచేసేవారు. కానీ గత వైసీపీ పాలనలో విద్యుత్ రాయితీ, ఆక్వా రంగానికి ప్రోత్సాహం లేక రొయ్యల చెరువుల సాగును నిలిపివేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రాయితీతో పాటు ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించాలని నిర్ణయించడంతో రొయ్యల సాగుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే అమెరికాలో పన్నుల మోతతో రొయ్య ధర తగ్గుముఖం పట్టింది. దీంతో రొయ్యల చెరువు సాగు విషయంలో పునరాలోచనలో పడ్డారు.





బుడగట్లపాలెంలో రొయ్యల చెరువు సాగు

- జిల్లాలో రొయ్యకు అమెరికా సుంకాల సెగ
- 4 శాతం ఉన్నది 27 శాతానికి పెంపు
- ఆందోళనలో నిర్వాహకులు, మత్స్యకారులు

రణస్థలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):

మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఉంది జిల్లాలో ఆక్వా పరిస్థితి. వైసీపీ పాలనలో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. గత ఐదేళ్ల ఎటువంటి ప్రోత్సాహం లేకపోగా.. విద్యుత్ చార్జీలు, ఇతరత్రా పన్నుల భారంతో పూర్తిగా కుదేలైంది. చాలామంది ఆక్వా రంగాన్ని వదిలి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకున్నారు. ఫలితంగా ఆక్వా పరిశ్రమపై ఆధార పడిన వేలాదిమంది ఉపాధికి దూరమయ్యారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ రాయితీలు, ఆహార ఉత్పత్తుల ప్రోత్సాహంలో భాగంగా ఊతమిచ్చే చర్య లు ప్రారంభమయ్యాయి. కానీ ఇంతలోనే అగ్ర రాజ్యం అమెరికాలో ప్రతీకార సుంకాలు మొదలయ్యాయి. దీంతో మన జిల్లా నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలపై కూడా పన్ను భారం పెరిగింది. దీనికి రవాణా, ఇతరత్రా చార్జీలు అదనం కానున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో రొయ్య ధర తగ్గించుకోవాల్సి వస్తోంది. దాని ప్రభావం ఆక్వాపై పడుతుందని రైతులతో పాటు మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో 11 తీరప్రాంత మండలాల్లో 4వేల హెక్టార్లలో ఆక్వా సాగవుతోంది. రణస్థలం, ఎచ్చెర్ల, గార, సంతబొమ్మాళి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పోలాకి మండలాల్లో ఆక్వాలో భాగంగా అధికంగా చేపల చెరువులు సాగు చేస్తున్నారు. సుమారు 1500 మంది నిర్వాహకులు చేపల చెరువులు సాగు చేయగా.. వాటిలో 10వేల మంది వరకూ పనిచేస్తున్నారు. ఏడాదికి రూ.200 కోట్ల మేర **(మిగతా 7వ పేజీలో..)**



కార్యాలయం లోపలకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న దివ్యాంగులు

సారూ.. మొర వినరూ..

- ‘మీ-కోసం’ కార్యక్రమానికి పోటెత్తిన వినతులు
- కార్యాలయంలోకి వెళ్లేందుకు దివ్యాంగులకు ఇబ్బందులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. ‘మీ-కోసం’ కార్యక్రమానికి వినతులు పోటెత్తాయి. జిల్లా వ్యాప్తంగా 190 ఫిర్యాదులు అందాయి. గత వారం రంజాన్ నేపథ్యంలో ‘మీ-కోసం’ రద్దు కావడంతో సోమవారం రద్దీ కనిపించింది. ఫిర్యాదుదారులతో నమోదు కేంద్రం కిటకిటలాడింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కాగా.. ‘మీ-కోసం’ కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు ట్రైసైకిల్‌పై వచ్చిన దివ్యాంగులను కార్యాలయంలోకి తీసుకువెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హాల్ లోపలకు వెళ్లే మార్గం ఇరుకుగా.. ఎత్తుగా ఉండడంతో ఆపసోపాలు పడ్డారు. వినతులు ఇచ్చేందుకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

‘మీ కోసం’ కార్యక్రమం ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ‘మీ-కోసం’లో 190 ఫిర్యాదులు రాగా.. అందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 79 ఉన్నాయని తెలిపారు. ‘హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా చర్యలు తీసుకోవాలి. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలి. సమన్వయంతో అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాల’ని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమస్యలపై చర్చిస్తారా?

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- వైసీపీ పాలనలో సిక్కోలుకు ఒరిగిందేమీ లేదు
- గతంలో సమావేశానికి కీలక ప్రజాప్రతినిధులు దూరం
- ఈసారైనా మోక్షం చూపాలని జిల్లావాసుల విజ్ఞప్తి

శ్రీకాకుళం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదిక.. జడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం జడ్పీ హాల్ నిర్వహించనున్నారు. వైసీపీ పాలనలో జడ్పీ సర్వసభ్య సమావేశానికి కీలక ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో ప్రజా సమస్యలు పక్కదారి పట్టేవి. రాజకీయ చర్చలు, చిన్నపాటి అంశాలకే పరస్పర ఆరోపణలతో విలువైన సమయం వృథా అయ్యేది. గత ఐదేళ్ల గ్రామ, మండల, నియోజకవర్గ అభివృద్ధికి తీసుకున్న చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం కొలువుతీరి ఏడాది సమీపిస్తుండగా.. గత రెండు జడ్పీ సర్వసభ్య సమావేశాల్లో కీలక ప్రజాప్రతినిధులు పాల్గొనలేదు. దీంతో కొంతమంది మండలస్థాయి ప్రజాప్రతినిధులు.. ఈ సమావేశాన్ని రాజకీయ చర్చలకు దారితీసేలా వ్యవహరించారు. కాగా నేడు నిర్వహించనున్న సమావేశానికి పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొనున్నారు. ఈసారైనా.. జిల్లాలో ప్రధాన సమస్యలపై సభ్యులు, ప్రజాప్రతినిధులు చర్చించి.. పరిష్కార మార్గం చూపాలని జిల్లావాసులు కోరుతున్నారు.

● ఇవిగో సమస్యలు..

జిల్లావాసులను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో డ్రైనేజీ వ్యవస్థ బ్రిటీష్ కాలం నాటిది. అప్పుడప్పుడు.. కొన్ని కాలువలను ఆధునికీకరిస్తున్నారు. కానీ పూర్తిస్థాయిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేదు. దీంతో వర్షం పడితే ప్రధాన జంక్షన్లు నీట మునిగిపోతున్నాయి. నగరం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

● వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 పనులు వేగంగా పూర్తిచేయాలి. సాగునీటిని పూర్తిస్థాయిలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకోవాలి. అలాగే (మిగతా 8వ పేజీలో..)

వైద్యసేవలు ఇలా

● ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి జిల్లాకే పెద్దదిక్కు. కానీ ఆ స్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. ట్రామా కేర్‌లో అవసరమైన వైద్య సిబ్బంది లేరు. ఓపీ చూడాల్సిన వైద్యులు అధికమంది.. మొబైల్‌లో ఆసుపత్రి ప్రాంగణంలో హాజరువేసేసి అక్కడ నుంచి సొంత ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. సాయంత్రం మళ్లీ సమయానికి వచ్చి ఎఫ్ఎల్ఆర్ఎస్‌లో హాజరువేసేసి వెళ్లిపోతున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు జూనియర్లు వైద్యులు సేవలందిస్తున్నారు. దీనిపై సమగ్ర పరిశీలన జరగాల్సి ఉంది.

● పలాస కిడ్నీరీసెర్చ్ సెంటర్‌లో కీలక వైద్య నిపుణులు, అవసరమైన సిబ్బంది లేక సేవలు సక్రమంగా అందడం లేదు. తక్షణమే సిబ్బందిని నియమించాలి.

● ప్రైవేటు ఆసుపత్రిల్లో సిజేరియన్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. కొన్ని పీహెచ్‌సీలలో ఒకటీ.. రెండు మాత్రమే ప్రసవాలు జరుగుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాలి.

● శ్రీకాకుళం మండలంలో నర్సింగ్ కళాశాల కోసం నిర్మించి వదిలేసిన భవనాన్ని వినియోగంలోకి తేవాలి.



జిల్లా పరిషత్ సమావేశ మందిరం

సులభంగా ఆధార్ సేవలు

- ఐదు సచివాలయాలకు ఒక కేంద్రం ఏర్పాటు
- నెలలో 8 రోజులపాటు శిబిరాలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ ఆధార్ సేవలను సులభంగా అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ‘జిల్లాలోని 732 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతీ ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 146 ఆధార్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ నెలాఖరులోగా మరో 37కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. ఈ కేంద్రాల్లో కొత్త ఆధార్‌కార్డు నమోదు, డాక్యుమెంట్ అప్‌డేట్, 5 నుంచి 7 ఏళ్ల, అలాగే 15 నుంచి 17ఏళ్ల వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోన్‌నెంబర్ అనుసంధానం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజల సౌకర్యార్థం ప్రతీ నెలా 8 రోజులపాటు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించి.. ఆధార్ సేవలను అందిస్తున్నాం. అవసరమున్న ప్రాంతాలను గుర్తించి ఈ శిబిరాలు నిర్వహిస్తాం. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలి. ముఖ్యంగా ఆరేళ్లలోపు పిల్లల జనన తేదీ వివరాల ను సమీప ఆధార్ కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలి’ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.

దళారులు దోచేస్తున్నారు!

- రబీలో కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- సిండికేట్‌గా మారిన కొందరు మిల్లర్లు, వ్యాపారులు
- ఒక్కో బస్తాకు రూ.500 వరకు తగ్గిస్తున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

● నరసన్నపేటలో నేతింటి వీధికి చెందిన శ్రీరాములు రబీ సీజన్‌లో ఎకరా పొలంలో వరిసాగు చేశారు. ఎన్నో కష్టాలు పడగా 25 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ధాన్యం కొనేవారు లేకపోవడంతో రోడ్డుపై ధాన్యం ఆరబోశారు. ఖరీఫ్ మాదిరి కాకుండా రబీలో వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

● జలుమూరు మండలం కరవంజ గ్రామానికి చెందిన ఎస్.రామన్న మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ఇంజన్ల సాయంతో సాగునీటిని పొలాలకు అందించి పండించారు. ప్రస్తుతం ధాన్యం దిగుబడి రాగా.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రోడ్డుపై ఆరబెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్తా ధాన్యం రూ.2,300 ఉండగా.. దళారులు రూ.1,900కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.



కంబకాయి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డు ఆరబెట్టిన ధాన్యం

నరసన్నపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఈ ఏడాది రబీ సీజన్‌లో సుమారు 3వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. జలుమూరు, నరసన్నపేట, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, పాతపట్నం తదితర మండలాల్లో వరి పంట చేతికి అందివచ్చింది. జిల్లాలో సుమారు 20వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం దిగుబడి వచ్చింది. కాగా రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంతవరకూ అనుమతులు రాలేదు. దీంతో ఆ ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి.. కళ్లాల్లో భద్రపరిచినా వాతావరణంలో మార్పుల కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో కొందరు వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్ వ్యవహరిస్తున్నారు. క్వింటా ధాన్యం బస్తా రూ.2,300కు కొనుగోలు చేయాల్సి ఉండగా.. బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఏటా ఖరీఫ్‌లో మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. రబీలో పట్టించుకోకపోవడంతో మిల్లర్లు, దళారులు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. బస్తాకు రూ.300 వరకు తగ్గించడమే కాకుండా, పొల్లు, మట్టి పేరిట సుమారు 3 కేజీల వరకూ మార్జిన్ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రబీలో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రభారతి వద్ద ప్రస్తావించగా.. రబీలో పండించే ధాన్యం కొనుగోలుపై ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

దోపిడీ ఇలా..

జిల్లాలో రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూర్పుగోదావరి జిల్లా మండపేట, సామర్లకోటకు తరలిస్తున్నారు. సన్నరకం ధాన్యం బస్తా రూ.1,900కు కొనుగోలు చేస్తున్నారు. బస్తా(100 కేజీలు) ధాన్యం మరపడితే 60 కేజీల బియ్యం దిగుబడి వస్తుంది. బియ్యం కిలో రూ.65 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అంటే బస్తాకు 3,800 వరకు రాగా.. రైతుకు సగం మాత్రమే చెల్లించి.. మిగతా మొత్తాన్ని దళారులు దోచుకుంటున్నారు.



బొడ్డవానిపేట వద్ద వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

రోడ్ల అనుసంధానంతో గ్రామాల అభివృద్ధి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- స్టేడియం పూర్తి చేయాలని పేట వాసుల వినతి

8లో

స్కూల్ పిల్లల ఆటో బోల్తా

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- ఇచ్ఛాపురంలో ఘటన

8లో



ప్రమాదానికి గురైన ఆటో

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- ఎస్పీ మహేశ్వరరెడ్డి
- గ్రీవెన్స్‌లో 81 వినతులు స్వీకరణ

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి 81 వినతులు అందాయి. ఈ వినతులను ఎస్పీ పరిశీలించి బాధితులతో ముఖాముఖీ మాట్లాడారు. సకాలంలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ల ఇన్‌చార్జిలను ఆదేశించారు. అలాగే వరం చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సోమవారం చలువ కళ్లద్దాలు, క్యాప్‌లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. కంచిలి మండలం కేశరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్ తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఎస్పీ సూచనల మేరకు డా.రెడ్డీస్ లేబరేటరీస్ ఉద్యోగులు స్పందించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చేతుల మీదుగా పరిశ్రమ ఉద్యోగలు సమకూర్చిన రూ.లక్షను నవీన్‌కు అందజేశారు. డీఎస్పీ వివేకానంద, ఎస్బీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

'నా కుమారుడి మృతిపై దర్యాప్తు చేయండి'

పొందూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గొర్లె కన్నారావు మృతిపై అనుమానాలున్నాయని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని పొందూరు మండలం ఎరుకల కాలనీకి చెందిన గొర్లె శ్రీరాములు సోమవారం ఎస్పీ గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిది ఆత్మహత్య కాదని కోడలు నాగలక్ష్మి, ఆమె తల్లిదండ్రులు సిద్దాబత్తుల లక్ష్మి, గురుమూర్తితో పాటు వారి బంధువులు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో కోరారు. గత నెల 10న కన్నారావు కొత్తూరు సర్కిల్ హిరమండలం సమీపంలో మృతిచెందారు. తన కుమారుడి మృతిపై గత నెల 15న ఫిర్యాదు చేశామని, దీనిపై మార్చి 19న కొత్తూరు సీఐ మా కుటుంబాన్ని పిలిచి దర్యాప్తుచేసి న్యాయం చేస్తామని చెప్పి ఇంతవరకు స్పందనలేదని ఫిర్యాదులో ఎస్పీకి మొర పెట్టుకున్నారు. న్యాయం జగరకపోతే న్యాయపోరాటం చేస్తామని శ్రీరాములు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

- జిల్లాలో 70మంది వాహనదారుల లైసెన్సుల రద్దు
- మరో 60 రద్దుకు ప్రతిపాదనలు
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మద్యం తాగ వాహనం నడుపుతూ పట్టుబడిన వాహనచోదకుల లైసెన్స్‌లను చట్ట ప్రకారం రద్దు చేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే 70 మంది వాహనచోదకుల లైసెన్స్‌లు రద్దు చేశామని, మరో 60 మంది లైసెన్స్‌లు రద్దుకు జిల్లా రవాణా శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పింపించామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా ద్విచక్రవాహనదారులు, ఆటోలు పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైతుబజార్, ఏడురోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆటోలు అధిక సంఖ్యలో రహదారి మార్గంలో నిలపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే బాధ్యులుగా తల్లిదండ్రులు లేకుంటే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్పీ సూచించారు. నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చాలని, సైలెన్సర్లు మార్చు చేసి సౌండ్ పొల్యూషన్ చేయవద్దని, ఆటో డ్రైవర్లు రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలన్నారు.

తాగునీరు అందించండి

కవిటి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కవిటి, కరాపాడు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు తాగునీరు అందించాలని ఆ గ్రామస్థులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆ గ్రామానికి చెందిన బి.జానకిరావు, బి.కోదండరావు వినతి పత్రాలు అందించారు. రెండు నెలలుగా ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీరు అందడంలేదని వాపోయారు. బల్ల ఎర్రగోవిందపుట్టుగ, పెద్ద, చిన్న ఎర్రగోవిందపుట్టుగ, బింగిపుట్టుగ, బల్లపుట్టుగ గ్రామాల్లో తాగునీరు అందక ఆ గ్రామస్థులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జల్‌జీవన్ మిషన్‌లో ఈ గ్రామాలు లేవని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్నతాధికారులు పర్యటించి సమస్య పరిష్కరించాలని కోరారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

అరసవల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జీఆర్ శ్రీకాంత్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సింగుపురం గ్రామంలో ఉన్న హటకేశ్వర కళావేదిక వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెలే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ గుండ మోహన్‌రావు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచండి

ఆమదాలవలస, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా పూజారిపేట వద్ద ఉన్న క్రిస్టియన్ మైనార్టీ బరియల్ గ్రౌండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా అదనపు జనరల్ సెక్రటరీ శామ్యూల్ అరుణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో మేనేజర్ బి.లక్ష్మీనారాయణకు ఆయన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బ్రదర్ సవలాపురపు అసిరికుమార్, బ్రదర్ అహరోన్‌రాజ్, బొర్ను తదితరులు ఉన్నారు.

భూ రీసర్వే సద్వినియోగం చేసుకోండి



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో సాయి ప్రత్యూష

సరుబుజ్జిలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష పిలుపునిచ్చారు. సోమవారం షలంత్రి పంచాయతీ బురిడివలస గ్రామంలో తహసీల్దార్ మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వేలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా రీసర్వే డీటీ జగదీష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, రైతులు గ్రామంలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ, రెవెన్యూ ఉద్యోగులు, సచివాయల ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు పీడీ పోస్టుల బదలాయింపు

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ఆందోళనలో పీఈటీ సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో భాగమైన ఫిజికల్ ఎడ్యుకేషన్ శాశ్వతంగా దూరం కానుంది. ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న పీడీ పోస్టులను జూనియర్ లెక్చరర్లుగా బదలాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తద్వారా రాష్ట్రంలో ఖాళీగా మొత్తం 199 ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు మాయమయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాకు వస్తే గత ఏడాది వరకు 42 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, అందులో దశాబ్ద కాలం నుంచి జిల్లాలోని 16 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయకుండా గత ప్రభుత్వాలు కాలయాపన చేసుకుంటూ వచ్చాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 199 పీడీ పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్పు చేయడంతో ఇంటర్మీడియట్‌లో ఇంచుమించు ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు భూస్థాపితం అయినట్లేనని క్రీడాకారులు, పీఈటీలు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఎంపీఈడీ చదువుకున్న విద్యార్థులకు, ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న పీఈటీల ఆశలన్నీ నీరుగారినట్టే. అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు, అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించడానికి జిల్లా అంతటా ఒక్క ఫిజికల్ డైరెక్టర్ ఇప్పటి వరకు లేరు. ఇంటర్మీడియట్ స్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్-19 ఎవరు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

హైస్కూల్ స్థాయితోనే సరి..

ఉన్నత పాఠశాల వరకు చురుగ్గా గ్రిగ్స్ పోటీలు, స్కూల్ గేమ్స్ పోటీలు పాల్గొంటున్న విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో పూర్తిగా పీడీలు లేకపోవడం హైస్కూల్ నుంచే క్రీడలు ఆపేయాల్సి ఉంటుందని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమోషన్ ప్రాతిపదికన 30 శాతం పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, నేరుగా 70 శాతం పోస్టులు ఎంపీఈడీ పూర్తయిన విద్యార్థులకు అవకాశం ఉంటుందని పీఈటీ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం పీడీ పోస్టులకు ఇతర సబ్జెక్టులకు కన్వర్షన్ చేయడం వల్ల ఏకంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ నిర్వీర్యం అయిపోతుందని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. జేఎల్ నోటిఫికేషన్‌లో జేఎల్ పీడీ పోస్టులు భర్తీ చేయాలని పీఈటీ సంఘం ప్రతినిధులను ఎంపీడీ పూర్తి చేసిన పీఈటీలు కోరారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు.



సంఘ ప్రతినిధులకు వినతి పత్రం అందజేస్తున్న పీఈటీలు

10న మెగా జాబ్ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మెగా జాబ్‌మేళాపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బి.ఫార్మసీ చదువుకుని 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్ మేళాకు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 400 ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు తమ వివరాలను స్కిల్‌యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుకోవాలన్నారు. వివరాలకు 6301045132, 9704960160, 8317652552 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజనల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీలో పాల్గొన్న గిరిజనలు

బూర్జ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఆదివాసీ గిరిజనల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఆఫీసర్ వద్ద గిరిజనుల సమస్యలు పరిష్కారం చేయాలని ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు సవర కృష్ణ, సవర సింహాచలం, సవర లక్ష్మణరావు, రాజు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కంట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరిశీలిస్తున్న వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ అడ్డయ్య

ఎచ్చెర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు జిల్లాలోని 53 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పరీక్షలు 21వ తేదీ వరకు జరగనున్నాయి. వర్సిటీ అధికారులు పర్యవేక్షించారు.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే చర్యలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ ముకుందరావు హెచ్చరించారు. సోమవారం చిన్నారులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురైన నేపథ్యంలో ఆటో, బస్సు డ్రైవర్లతో పాటు పాఠశాలల మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, నిర్లక్ష్యంగా వ్యవహించే డ్రైవర్లుతో పాటు మేనేజ్‌మెంట్‌పై కూడా చర్యలు ఉంటాయన్నారు.

ప్రతీ ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అరసవల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని సీనియర్ వైద్యాధికారి వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.సుజాత, డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో సుగంధద్రవ్య మర్దన



కొట్నం దంపులో పాల్గొన్న అర్చకులు

అరసవల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సుగంధ ద్రవ్య మర్దన వైభవంగా నిర్వహించారు. తొలుత ఉషా ఛాయా, పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరణ చేసి ఆలయ అనివెట్టి మండపంలో సుమంగళి పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి సమర్పించిన సుగంధ ద్రవ్యాలతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈవో, అర్చకులు కొట్నం దంపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, అర్చకులు నేతింటి హరిబాబు, ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

దినసరి ఉద్యోగుల జీతాల విడుదలకు ఉత్తర్వులు

అరసవల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో గత 14 నెలలుగా జీతాలు అందక దినసరి వేతనదారు లు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. చివరికి రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు చొరవతో పెండింగ్ జీతాల విడుదలకు దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 14 నెలల తమ కష్టాలకు తెరపడిందని సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆలయంలో పనిచేస్తున్న 48 మంది దినస రి వేతనదారులకు సంబంధించి, మళ్లీ ఎంతమందిని విధుల్లోకి తీసుకోవాలి అన్న విష యంపై ముగ్గురితో కూడి కమిటీ నిర్ణయిస్తుంది. ఈ కమిటీలో ఆలయ ఈవో భద్రాజీ, దేవదాయశాఖ ఏసీ ప్రసాద రావు పట్నాయక్, అలాగే విశాఖకి చెందిన డీసీ స్థాయి అధికారి ఉంటారు. వీరు సిబ్బంది సంఖ్యను నిర్ణయిస్తారు. నిజానికి 2024 జనవరిలో ఆలయం డీసీ స్థాయి ఆలయంగా గుర్తించినా అందుకు సరిపడా సిబ్బందిని మాత్రం కేటాయించలేదు. డీసీ స్థాయి ఆలయానికి సంబంధించి కనీసం ఒక అసిస్టెంట్ ఈవో, ఇద్దరు సూపరింటెండెంట్లు, కనీసం నలుగురు ఇంజినీరింగ్ సిబ్బంది (ప్రస్తుతం ఒక్కరూ లేరు), నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు ఉండాలి. కానీ ఏడాది గడుస్తున్నా సరే ఇంతవరకు సిబ్బందిని కేటాయంచకపోవడంతో ఒకరిద్దరిపై ఆధారప డాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే కావలసిన సిబ్బందిని కేటాయిస్తే ఆలయం అన్నివి దాలా మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ దిశగా నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆదిత్యాలయాన్ని దేశంలోనే ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సోంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ హాల్‌టికెట్టు జెరాక్స్ కాపీతో హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికారం తీసుకోవడం వల్ల ప్రసవం సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని సీహెచ్‌సీ వైద్యులు ఎస్.అనూష అన్నారు. సోమవారం సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ గర్భిణులు సహజ ప్రసవంపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. హెడ్‌నర్సు భవాని, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న రాష్ట్ర పీఎంటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళగిరిలో గల విద్యాభవన్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఎంటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధర్మాన భాస్కరరావు, రాజగోపాల్ పిలుపునిచ్చారు. ఏకీకృత సర్వీస్ డ్రాఫ్ట్ రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.84 పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు.

జాతీయ సమైక్యతే లక్ష్యం

ఆమదాలవలస, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అదే స్ఫూర్తితో ఇంద్రజాల ప్రదర్శనలను దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్టు అపర ఆంధ్ర సర్కార్ మాంత్రిక రాజా బేతా శ్రీనివాస్‌రాజు అన్నారు. కొర్లకోట గ్రామంలో జాతీయ సమైక్యత కోసం ఆదివారం రాత్రి ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సువ్వారి నేతాజీ, రంగస్థల కళాకారులు ధనుంజయ, గ్రామ పెద్దలు శ్రీనివాసరాజు, కార్యక్రమ సమన్వయకర్త కొంక్యాన వేణుగోపాల్‌ను సత్కరించారు.

ఉపాధి పనులు ప్రారంభం

కంచిలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పెద్దకొజ్జిరీయలో ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న చెరువు పనులను సర్పంచ్ పొందల డిల్లీరావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొడ్డ రాంకుమార్, హరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ బి.రాజశేఖర్, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రణస్థలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద జేఆర్ పురం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. గంజాయి రవాణా అరికట్టేందుకు ప్రత్యేక డాగ్‌తో తనిఖీ లు నిర్వహించారు. కార్యక్రమలో జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాకు కష్టకాలం

(ఐదో పేజీ తరువాయి)

క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. ఎక్కువగా అమెరికాకు ఎగుమతయ్యే రొయ్య ఇక్కడ సాగవుతోంది. ఇక్కడ నుంచి రొయ్యలను వ్యాపారులు సేకరించి విశాఖ పోర్టు నుంచి ఎగుమతి చేసేవారు. ఇప్పటివరకూ అమెరికాలో రొయ్యలపై 3 నుంచి 4 శాతం సుంకం మాత్రమే విధించేవారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. సుంకాలపై నిర్ణయంలో భాగంగా ఏకంగా 27 శాతానికి పెంచనున్న నేపథ్యంలో ధర అమాంతం పెరగనుంది. దాని ప్రభావంతో జిల్లా రైతులు ధర తగ్గించుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పరిణామంతో జిల్లాలో రొయ్యల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఆక్వా నిర్వాహకులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వైసీపీ పాలనలో కుదేలు..

వైసీపీ పాలనలో ఆక్వారంగానికి ఎటువంటి ప్రోత్సాహం లేదు. పెరిగిన మేతలు, మందుల ధరలు, లీజు వ్యవహారాలతో ఆక్వారంగం మరింత నీరసించిపోయింది. ఆక్వా జోన్ల సమస్య, విద్యుత్ ధరలతో ఏకంగా కుదేలైంది. జగన్ రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందిస్తామని చెప్పారు. కానీ అమలు చేయలేకపోయారు. ఈ-షిప్ విధానంలో అనేక నిబంధనలను తెరపైకి తెచ్చారు. టీడీపీ హయాంలో వంద రొయ్యల ధర రూ.250 నుంచి రూ.260 వరకూ ఉండేది. కానీ వైసీపీ హయాంలో రూ.180కు పడిపోయింది. ఉప్పు, మంచినీరు ఆక్వా జోన్లుగా విభజించారు. పది ఎకరాల్లోపు సాగుచేసిన రైతులకు మాత్రమే రూ.1.50కు యూనిట్ విద్యుత్‌ను అందించారు. దీంతో జిల్లాలో వందలాది మంది ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందలేదు. పది హార్స్ పవర్ విద్యుత్ మోటారును వినియోగించేవారికి రాయితీ వర్తించదని.. ఈ-షిప్ విధానంలో చెరువుల లీజు ఒప్పందం, లైసెన్స్, విద్యుత్ మీటరు, భూమి ఆన్‌లైన్ పత్రాలు ఇవ్వాలని మెలిక పెట్టారు. వీటిలో ఏ ఒక్కటీ లేకపోయినా యూనిట్ విద్యుత్‌కు రూ.6వరకూ కట్టాల్సి వచ్చేది. దీంతో రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించిన చాలామంది చెరువుల సాగును నిలిపివేశారు.

కూటమి సానుకూల నిర్ణయం..

తాజాగా కూటమి ప్రభుత్వం చెరువులు సాగుచేసే వారికి రాయితీ విద్యుత్ అందించాలని నిర్ణయించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో స్పష్టం చేశారు. 2014-2019 మధ్య కూడా చంద్రబాబు సర్కారు రూ.2కే యూనిట్ విద్యుత్ అందించడంతో ఆక్వా నిర్వాహకులు ఇంజన్లను తొలగించి మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఎటువంటి నిబంధనలు లేకుండా అందించేందుకు సిద్ధపడిన తరుణంలో జిల్లాలో వందలాది మంది ఆక్వా నిర్వాహకులు చెరువులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. కానీ ట్రంప్ సుంకాల గండం వెంటాడడంతో మరోసారి ఆక్వా రంగం ఉనికికి ప్రమాదం ఏర్పడుతోంది. అందుకే దేశీయంగానే రొయ్యకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని జిల్లాలో ఆక్వా రైతులు, కార్మికులు, మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దెబ్బతిన్న ఆక్వా రంగం..

ఆక్వా రంగం దారుణంగా దెబ్బతింది. గత ఐదేళ్లలో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ ప్రకటించింది. ఆహార ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించడం శుభ పరిణామం. కానీ అమెరికాలో సుంకాల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రొయ్యల విక్రయాలు నిలిచిపోయాయి. ఇది ఆందోళన కలిగించే విషయం.

-దుమ్మ అశోక్, మత్స్యకార ప్రతినిధి, జీరుపాలెం

దేశీయంగా మార్కెట్ కల్పించాలి..

జిల్లాలో 11 మండలాల్లో చేపల చెరువులు సాగుచేస్తున్నారు. ఇందులో మత్స్యకారులే అధికం. తీరంలో వేట గిట్టుబాటు కావడం లేదు. చేపల చెరువులతో ఉపాధి పొందేందుకు అవకాశం లేకుండా పోతోంది. అందుకే ఆక్వా ఉత్పత్తులకు దేశీయంగా మార్కెట్ కల్పించాలి. ప్రభుత్వమే గిట్టుబాటు ధరను ప్రకటించాలి.

- ఆర్.వాసుదేవరావు, ఆక్వా రైతు

ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలి

అరసవల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలని ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ప్రతినిదులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వారు సోమవారం కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడ్జెట్లో వైద్యరంగానికి 5శాతం నిధులను కేటాయించాలని, మాతా, శిశు మరణాలను అరికట్టాలని, మహిళల్లో రక్తహీనత సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీపీసీ కన్వీనర్ టి.రాము, ఏపీఎంఎస్ఆర్‌యూ కార్యదర్శి డి.వాసుదేవరావు, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, సుధాకర్, అట్టాడ అప్పల నాయుడు, ఆదినారాయణ, గోపి, ఇండియన్ మెడికల్ అసిసోయేషన్ జిల్లా అధ్యక్షుడు డా.సనపల నరసింహమూర్తి, డాక్టర్ వినోద్‌కుమార్, ప్రజారోగ్యవేదిక సభ్యులు ఎస్.రాజారావు, వి.కల్యాణరాజు, ఎస్.శ్రీకాంత్, వి.సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి గ్రామం కోదండ రామయ్య ఆలయంలో సోమవారం నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రజని దంపతులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమరాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి సతీమణి కన్నుమూత

● అంత్యక్రియల్లో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు




అంత్యక్రియల్లో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు (ఇన్‌సెట్‌లో) శార్వాణి (ఫైల్)

కోటబొమ్మాళి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం మాజీ ఎమ్మెల్యే, దివంగత కింజరాపు కృష్ణమూర్తి నాయుడు సతీమణి శార్వాణి (85) సోమవారం విశాఖపట్నంలో కన్నుమూశారు. కుమారుడు కింజరాపు కృష్ణప్రసాద్ ఉత్తరాంధ్ర విద్యుత్ ప్రాంతీయ నిఘా విభాగం అధికారి (రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్)గా పనిచేస్తున్నారు. శార్వాణి వృద్ధాప్య సమస్యలతో కుమారుడి స్వగృహం విశాఖపట్నంలో మృతి చెందారు. ఈమె రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు పెద్దమ్మ. శార్వాణి మృతదేహానికి నిమ్మాడలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పాల్గొని సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి నాయుడు 1967 లో స్వతంత్ర పార్టీ తరపున హరిశ్చంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఈయనకు ముగ్గురు సోదరులు వెంకట రాములు, దాలినాయుడు, విశ్వనాథం. దాలినాయుడు మంత్రి అచ్చెన్నాయుడు తండ్రి. శార్వాణి అంత్యక్రియల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న కింజరాపు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళి అర్పించారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



అప్పన్న (ఫైల్)

నరసన్నపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మడపాం గ్రామం వద్ద వంశధార నదిలో చేపల వేటకు వెళ్లిన ఇదే గ్రామానికి చెందిన అంజలి అప్పన్న ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన సంభవించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం సాయంత్రం నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన అప్పన్న ఈసురు వల వేసే సమయంలో ముందుకు తూగి రాయి మీద పడడంతో ఈ ప్రమాదం జరిగింది. సోమవారం మృత దేహాన్ని గుర్తించిన గ్రామస్థులు ఆయన కుటుంబ సభ్యులకు తెలిపారు. అలాగే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్ఐ అసిరినాయుడు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. వేటకు వెళ్లి అప్పన్న మృతి చెందిన ఘటన పై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి మత్స్యశాఖ అధికారులను వెళ్లి పరిశీలించాలని ఆదేశించడంతో మత్స్యశాఖ అధికారులు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. మృతుడికి భార్య మాధురి, ఇద్దరు పిల్లలు న్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో వారు బోరున విలపిస్తున్నారు. ఉప్పరిపేట నుంచి కొన్నేళ్ల కిందట ఆయన మడ పాం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గాయపడిన యువకుడి మృతి

● నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



వేణు (ఫైల్)

ఎచ్చెర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కింతలి మిల్లు జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎచ్చెర్లకి చెందిన జలుమూరు వేణు (21) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. జరజాం గ్రామానికి చెందిన బస హరి ప్రసాద్, వేణు బైక్‌తో శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల వైపు వస్తుండగా అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో బస హరిప్రసాద్ అక్కడి కక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన వేణును తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వేణుకు తల్లి హేమలతతో పాటు అన్నయ్య, చెల్లి ఉన్నారు. తండ్రి గోపి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ కొవిడ్ సమయంలో మృతి చెందారు. వేణు మృతితో పుట్టెడు దుఃఖంలో కూడా కుటుంబ సభ్యులు ఆ యువకుడి నేత్రాలు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు దానం చేశారు. అందరితో కలివిడిగా ఉండే వేణు మృతితో ఎచ్చెర్లలో విషాదచాయలు అలముకుంది.

ఇరువర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళంక్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బలగ ప్రాంతానికి చెందిన గుజ్జల గోపి, రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు ఆదివారం రాత్రి ఏసీబీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం కొనేందుకు వెళ్లారు. దుకాణంలో ఉన్న క్యాషియర్ సుందరరావు వారికి మద్యం సీసాలు ఇచ్చి డబ్బులు అడిగారు. తాము డబ్బులు ఇవ్వమని దిక్కున్న చోట చెప్పుకోమని వారు అనడంతో రెస్టారెంట్ బోయ్ శ్రీనివాసరావు డబ్బులివ్వాలని లేకపోతే బయటకు వెళ్లిపోవాలని సూచించాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. మద్యం దుకాణం నుంచి రామకృష్ణ, గోపిలను బయటకు తోయడంతో.. వారిద్దరు రాళ్లను దుకాణంపైకి విసిరారు. ఈ క్రమంలో దుకాణంలో ఉన్న శ్రీను చేతికి గాయం కావడంతో అక్కడే ఉన్న ఖాళీ మద్యం సీసాను తిరిగి వారిపైకి విసరడంతో రామకృష్ణ, గోపి గాయపడ్డారు. ఇరువర్గాల వారు రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

స్కూల్ పిల్లల ఆటో బోల్తా

● ముగ్గురు విద్యార్థులకు గాయాలు



చిన్నారులతో మాట్లాడుతున్న ఎస్ఐ (ఇన్‌సెట్‌లో) చికిత్స పొందుతున్న విద్యార్థి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి సురంగిరాజా కోట సమీపంలో ఓ ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సురంగి కోట సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పురుషోత్తపురం, ఏఎస్‌పేట ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో సోమవారం 15 మంది విద్యార్థులతో వెళ్తున్న ఆటో కోట సమీ పానికి వచ్చేసరికి ముందున్న లారీని తప్పించే క్రమంలో బోల్తా పడింది. దీంతో పిల్లలంతా అందులో ఇరుక్కున్నారు. అక్కడే ఉన్న కొంతమంది స్పందించి పిల్లలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు విద్యార్థులను స్థానిక ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం పూర్తిగా విరిగి పోయింది. అయితే పరిమితికి మించి చిన్నారులను ఎక్కించడం, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

పొందూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రైలు ఢీకొని వెంకటరమణ (21) మృతిచెందాడు. రాజాం మండలం సీఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించినట్టు జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. రైలు పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని షరీఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు.

రోడ్ల అనుసంధానంతో గ్రామాల అభివృద్ధి

● భావనపాడు, పలాస వద్ద విమానాశ్రయాల ఏర్పాటు
● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



పోలాకి: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి రోడ్లు దోహద పడతాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో పలు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బొడ్డవానిపేట వద్ద కిళ్లాం కాలువపై వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉప్పరిపేట, ముసుడుగట్టు మీదుగా లుకలాం వరకు బీటీ రోడ్డును ప్రారంభించారు. పోలాకి మండలం జొన్నాం, డోల గ్రామాలకు, చెల్లాయివలస కూడలి నుంచి దేశవానిపేటకు బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలో రాక ముందు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండేవని, అభివృద్ధి లేక తలసరి ఆదాయం తగ్గి పోయిందన్నారు. ఎన్డీఏ సర్కారు వచ్చిన ఆరునెలల్లో అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. నదీ తీర గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. భావనపాడు, పలాస వద్ద విమానాశ్రయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా రూ.పది వేల కోట్లు వెచ్చించామన్నారు. చెల్లాయివలస పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నదీ తీర గ్రామాలకు రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

● నరసన్నపేటలో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని పట్టణవాసులు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ప్రజాసదన్‌లో ఆయన వినతులను స్వీకరించారు. జమ్ము పంచాయతీ పొన్నానపేట గ్రామానికి రోడ్డు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫోన్‌లో కేంద్ర మంత్రి సూచించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, నరసన్నపేట మార్కెట్‌కమిటీ ఛైర్‌పర్సన్ పాగోటి ఉమాకుమారి, టీడీపీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, సాసుపల్లి కృష్ణబాబు, గొద్దు చిట్టిబాబు, సరియపల్లి మధు, బోయన సతీష్, బలగ ప్రహర్ష, బోయన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమికి హక్కులు కల్పించాలి



హరిపురం: మందసలో ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘ నేతలు

హిరమండలం/కొత్తూరు/హరిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హిరమండలం, కొత్తూరు, మందసల్లో ధర్నా నిర్వహించారు. ఆదివాసీలు సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మందసలో జరిగిన కార్యక్రమంలో మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, కొండలోగాం పంచాయతీలో ఆక్రమణలను తొలగించాలని, మాణిక్యపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. హిరమండలంలో మర్రిగూడ, కిరిడివలస, అంతిలి, కుర్మవలస, బొందుగూడ తదితర గ్రామాల్లో ఇళ్లు కట్టుకోవడానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. కొత్తూరు మండలంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం సంబంధిత అధికా రులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో గిరిజన సంఘాల నేతలు గోపి, కె.రమేష్, సవర గురునాథ్, సవర పాల్గునరావు, సవర ధర్మారావు, శివ, దుర్గారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, రైతు సంఘం కార్యదర్శి కె. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



హిరమండలంలో ధర్నా చేస్తున్న గిరిజనులు



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెలల తరబడి తాగునీరందించరా?

● మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

హిరమండలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలో నెలల తరబడి తాగునీటి సమస్య ఉన్నా ఎందుకు పరిష్కరించడంలేదని ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్‌ను నిలదీశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగ సేవలపై ఏఈ సాగర్ వివరిస్తుండగా.. ఇటీవల చిన్న కోరాడ, గాంధీనగర్ వీధులకు చెందిన మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసేవరకు మీరు ఏం చేస్తున్నారని ఎంపీటీసీలు ప్రశ్నించారు. తాగునీటి సమస్యను ఎప్పటి లోగా పరిష్కరిస్తారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, ఎంపీటీసీ మీసాల రజని ప్రశ్నించారు. గొట్టాబ్యారేజి దిగువన ఇన్‌ఫిల్టరేషన్ బావిలో నీరు అడుగంటి పోవడంతో సమస్య ఏర్పడిందని, చొర్లంగి మెగా వాటర్ స్కీం పనులు చేస్తున్నామన్నారు. అయితే నీరు హై ప్రెషర్ వల్ల పైప్‌లైన్ లీకవుతోందన్నారు. ట్యాంకర్‌ను సమకూరుస్తున్నామని, తాత్కాలికంగా నీటి సరఫరా చేస్తామని ఎంపీడీవో కాశీప్రసాదరావు తెలిపారు. జడ్పీటీసీ పి.బుచ్చి బాబు మాట్లాడుతూ.. జడ్పీ నుంచి తాగునీటి పథకానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో హిరమండలం, గులుమూరు పంచాయతీలకు తాగునీటి సమస్య తీర్చాలని సూచించారు.

సమస్యలపై చర్చిస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

ఎచ్చెర్ల నియోజకవర్గంలో నారాయణపురం ఆనకట్ట, తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు కలగా మారుతోంది. కాలువల ఏర్పాటు.. పాత కాలువలను చక్కదిద్దేందుకు తీసుకున్న చర్యలు గత ప్రభుత్వంలో లేవు. ఇప్పుడైనా చర్యలు తీసుకోవాలి. ● శ్రీకాకుళం నియోజకవర్గంలో కళ్లేపల్లి, కళింగపట్నం సముద్ర తీరాలను అభివృద్ధి చేయాలి. ● పల్లె ప్రాంతాల్లో బెల్టు దుకాణాలు ఎక్కువ య్యాయి. ఎక్సైజ్ అధికారులు కేవలం సారా తయారీదారులపైనే కాకుండా బెల్టు దుకాణదారులపైనా చర్యలు తీసుకోవాలి. ● గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల కాలనీల్లో స్థలాల కేటాయింపు నుంచి.. అక్కడ నిర్మాణాల్లోనూ పెద్దఎత్తున అవకత వకలు జరిగాయి. మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి వైసీపీ నేతలు తమకు అనుకూలంగా మలు చుకుని భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారు. శ్రీకాకుళం నగర ప్రజలకు ఇచ్చిన స్థలాల్లో ఇటువంటి అక్రమాలు అధికంగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలి. ● జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గం వరకు.. మండల కేంద్రాల్లోనూ రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేశారు. పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ప్రజలకు ఇప్పటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందడంలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

● వేసవిలో తాగునీటి సమస్య జఠిలం కాకముందే నదుల్లో .. వంతెనల వద్ద .. తాగునీటి ప్రాజెక్టు ఇన్‌ఫిల్టర్ బావుల వద్ద ఇసుక తవ్వకాలపై నిషేధాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాలి. అలాగే పాడైన రక్షిత పథకాలను సకాలంలో బాగుచేయాలి.

● పాతపట్నం నియోజకవర్గంలోని వంశధార నదిలో.. కొన్ని పంచాయతీల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

● ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును పరుగులెత్తించాలి. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు, నదుల అనుసంధాన ప్రక్రియ చేపట్టాలి. సమగ్ర కలెక్టరేట్ వినియోగంలోకి తేవడం.. ఆక్రమణకు గురవుతున్న చెరువులు.. వీటన్నింటిపై చర్చ జరగాలి. అప్పుడే జిల్లా ప్రజలకు సమస్యల బారి నుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది ప్రజా వ్యతిరేక పాలన

టెక్కలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేశంలోను, రాష్ట్రంలోనూ పాలకులు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని కుల నిర్మూలన పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్ అన్నారు. సోమవారం 'పూలే జయంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరా ట దినాలుగా పాటిద్దాం'లో భాగంగా గొడగల వీధిలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని, బస్తర్‌లో భూమి కింద ఉండే గనులను, అడవులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అడ్డు వచ్చే ఆదివాసీలను చంపుతు న్నారన్నారు. రాష్ట్రంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లిస్తున్నా ఆయా వర్గాల ఎమ్మెల్యేలు మౌనం వహిస్తున్నారన్నారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, గొడగల సంఘం నాయకులు అశోక్, సురేష్, రామారావు, భాస్కర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

'రియల్'కు అనుకూలంగా కాలువ మార్చడం దారుణం

టెక్కలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గోపినాథ పురం ఊర చెరువుకు వెళ్లే వంశధార కాలువను తెలుకలవీధి నుంచి కోదండరామవీధి పక్కన బన్నువాడ రోడ్డు వైపునకు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా చేయడం దారుణమని సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాలువను లోతుచేసి ఊరచెరువుకు నీరు వెళ్లే విధంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే బన్నువాడ వైపుకు పోతున్న 49ఆర్ నుంచి జయకృష్ణాపురం ఊర చెరువుకు పోయే కాలువను మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణం అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించి రైతులకు మేలు చేకూర్చాలన్నారు. వారితో పాటు బగాది వాసుదేవరావు, బమ్మిడి సోమేష్ ఉన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకు తుందని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. సోమవారం బెండి పంచాయతీ మహదేవపురంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి ఆధ్వర్యంలో రీ సర్వే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కారం అవుతాయన్నారు కార్యక్రమంలో డీటీ కె. శ్రావణ్‌కుమార్, సర్వేయర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పూండి సబ్ స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్లు, కొత్త లైన్లు ఏర్పాటు చేయనున్నందున బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని, ఈ విషయాన్ని వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ నిలిచిపోయినా స్పందించరా?

పలాస, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి వేలాది మంది రోగులు ఇబ్బందులు పడుతు న్నారని, అయినా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. సోమవారం జీఎంఈ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంపై సీఎంకు శ్రద్ధలేదన్నారు. పేదలకు ఉచితంగా ఏవ చేస్తారో చెప్పలేకపోయారని, తమ ప్రభుత్వ హయాంలో చక్కగా నడుస్తున్న ప్రజా పథకాలను పక్కన పెట్టి ప్రజలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీని బడాబాబులకు కట్టబెట్టి ప్రైవేటు పరం చేయనున్నారా అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సర్వేలు వేగవంతం చేయండి

పలాస, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో చేపడుతున్న సర్వేలు వేగవంతం చేయాలని కమిషనర్ ఎన్. రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం తన చాంబర్‌లో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ.. హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్, చిల్డ్రన్ విత్ ఆధార్, డెత్ ఆడిట్ రీ వెరిఫికేషన్, పీజీఆర్ఎస్ వేలిముద్రల సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ వ్యవహారంలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఆస్తిపన్ను మార్పిడి, వితంతు పించన్ల కోసం 13 దరఖాస్తులు వచ్చాయి.

ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకో వాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎల్.శ్రీనివాస్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో తీరిన నీటి సమస్య

నందిగాం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శివరాంపురం పంచాయతీ కోటిపల్లిలో నీటి సమస్య మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో పరిష్కారమైంది. గతంలో జల్ జీవన్ మిషన్ కింద కుళాయి పైపు లైన్ వేసినప్పటికీ మోటార్ ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ సబ్బి జానకిరాం మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మోటార్ ఏర్పాటు చేశారు. ఈ మోటార్‌ను సర్పంచ్ సోమవారం ప్రారంభించి తాగునీటిని సరఫరా చేశారు. జనసేన మండల అధ్యక్షుడు తాడేల చిరంజీవి యాదవ్, గ్రామ పెద్దలు కె. కృష్ణమూర్తి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

● ఘనంగా శ్రీరాముని కల్యాణం



శ్రీరామ కల్యాణం దృశ్యం

పోలాకి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామాల్లో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరి సింది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు నిర్వ హించారు. పోలాకి, చెల్లాయివలస, బెలమర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరాముని కల్యాణం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలాకి రామాలయంలో పురోహితుడు దార్లపూడి నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో అంబేద్కర్ కమిటీ నాయకుడు చిన్నప్పన్న దంపతులు కల్యాణం నిర్వహించారు. దీర్ఘాశిలో ఐదురోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

నందిగాంలో..



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నందిగాం, ఏప్రి ల్ 7(ఆంధ్రజ్యోతి): నందిగాంలో సీతారాముల కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపంలో లమ్మత మధుబాబు ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, ఎం. రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు చేసి కల్యా ణాన్ని వైభవంగా చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పట్టాభిషేకం చేస్తున్న భక్తులు

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

పలాస, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సీతా రామాలయంలో శ్రీరామ నవమి ఉత్స వాల్లో భాగంగా సోమవారం శ్రీరామ పట్టాభిషేకం వైభ వంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విశేష పూజలు, పట్టాభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. సీతారాముల విగ్రహాలకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభి షేకం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు.

అల్లాడలో శుభరాట..

జలుమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అల్లాడ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణానికి సోమవారం పందిరిరాట వేశారు. గ్రామ పురోహితుడు ఈవీ ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో హనుమంతు రంగనాథం మాస్టారు దంపతులు ప్రత్యేక పూజలు చేసి శుభరాట వేశారు. బుధవారం శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



హరికృష్ణమ్మ పేటలో సీతారాముల విగ్రహాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

శ్రీరామ మందిరాల్లో..

జలుమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రామమందిరాల్లో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరికృష్ణమ్మపేట, ఊడిగలపాడు గ్రామాల్లోని శ్రీరామ మందిరాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. హరికృష్ణమ్మపేటలో వేదపండితుడు అక్కాజోస్యుల రమేష్ శర్మ నేతృత్వంలో గ్రామ పురోహితుడు రాజశేఖరశర్మ శ్రీరామ పట్టాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 సుగంధ ద్రవ్య జలా లతో సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేశారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వసంతోత్సవాలు

పాతపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీగిరిపై షిర్డీసాయినాథ ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు ముగిశాయి. ఉగాది నుంచి ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు భక్తి పాటలు, వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు సోమవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ధ్యాన మందిరం ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.